వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ మంగళవారం 29 సెప్టెంబర్ 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 93




టీజీపీఎస్సీ సర్ప్రైజ్ ధమాకా.. ఎగ్జామ్ డేట్స్ వచ్చేసినయ్..!

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## 20 కోట్ల ఓట్లను తొలగించాలన్నది
# ప్రధాని మోదీ లక్ష్యం

### దేశమంతా ఒక్కటై తిరుగుబాటు చేయడం ఖాయం
### మైనార్టీలను అణచివేసిన ప్రతిచోటా విప్లవం వస్తుంది
### ఏబీవీపీ కార్యకర్తగా డీలిమిటేషన్ వద్దని చెబుతున్నా..
### సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక



**భారతీయులపై పెత్తనం చేయడానికి బ్రిటీషర్లు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశమంతా ఒక్కటై ఉద్యమించినట్లుగానే ఇప్పుడు 'సర్'ను నిరసిస్తూ.. దేశప్రజలంతా ఉద్యమించే కాలం ఎంతో దూరంలో లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును లాగేసుకోవడానికి ఎన్నికల సంఘం ద్వారా ప్రధాని మోదీ చేస్తున్న కుట్రలను ప్రజలు సహించబోరని మండిపడ్డారు. మొత్తం 20 కోట్ల ఓట్లను తొలగించాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. అదే జరిగితే పేదవాడికి రాజ్యాంగం ప్రసాదించిన ఆయుధాన్ని లాక్కున్నట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్రలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఒక్కటి కావడం ఖాయమన్నారు. ఇందులో మమతాబెనర్జీ, శరద్‌పవార్, ఉద్ధవ్ ఠాక్రే, స్టాలిన్ అంతా ఒక్కటి కావాల్సిందేనని పేర్కొన్నారు. అస్సాంకు చెందిన 'ప్రతిదిన్' పత్రిక సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అన్న అంశంపై రేవంత్‌రెడ్డి మాట్లాడారు.**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 : "భారత్‌పై పెత్తనం చెలాయించడానికి బ్రిటీషర్లు 1928లో సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఏడుగురు సభ్యులూ బ్రిటిష్ వారే. అంతా మీరే ఉంటే మాకు న్యాయం జరగదంటూ లాలా లజపతిరాయ్ సైమన్ గోబ్యాక్ పేరిట నినదించి దేశాన్ని ఒక్కటి చేశారు. ఆ పోరాటంలో ఆయన అసువులు బాశారు. తర్వాత ఆ జెండా పట్టుకొని భగత్‌సింగ్ బయలుదేరారు. ఆ ఉద్యమమే తర్వాత దేశ స్వాతంత్ర్యానికి తోవ చూపింది. దాదాపు వందేళ్ల తర్వాత ఇప్పుడు..

-మిగతా 2 లో..

### టీడీపీ ప్రాభవం కోల్పోవడం వల్లే నేను పార్టీ మారా

"రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో టీడీపీ ప్రాభవం కోల్పోయిందని, చంద్రబాబునాయుడుతో కలిసి పనిచేస్తే తెలంగాణలో ఇబ్బందని ప్రజలు చెప్పడం వల్లే పార్టీ మారానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నాడు కేంద్రంలో టీడీపీ భాగస్వామ్యంతో ఉన్న ఎన్‌డీఏతో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌తో పోరాడటానికే కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పారు. దేశ భవిష్యత్తును పునర్నిమించడంలో యువతకు ప్రాధాన్యత అవసరమన్నారు. జెన్ జీ సవాళ్లు, వారి ఆకాంక్షలను ప్రతిబింబించేలా పరిపాలన సాగాలని, యువతకు రాజకీయ ప్రాతినిధ్యం, విస్తృత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణలో వినూత్నంగా ప్రారంభించిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ద్వారా యువతకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడానికి తీసుకుంటున్న చర్యలను రేవంత్ వివరించారు.

## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులా?..
# మీరే నష్టపోతారు

### హైడ్రాకు కాంగ్రెస్ నేతల భూములు కనపడవా?
### గడిచిన మూడేళ్లలో రేవంత్ రెడ్డి ఒక్క మంచి పనైనా చేశాడా?
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**పేదలను కొట్టి పెద్దలకు పెట్టడం ఇందిరమ్మ రాజ్యమా అని ప్రశ్నించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కాంగ్రెస్ నేతల భూములు ముట్టుకోరు? పేదల భూములపై మాత్రం పడతారు. హైడ్రాకు కాంగ్రెస్ నేతల భూములు కనపడవా?. రైతుల ఇంటికి పోలీసులను పంపాల్సిన అవసరం ఏంటి? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెడితే మీరే నష్టపోతారు అంటూ వ్యాఖ్యలు చేశారు.**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలంగాణభవన్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన మూడేళ్ల మురిపెం అయ్యింది. కాంగ్రెస్ 420 హామీలిచ్చి ప్రజలను మోసం చేసింది. తెలంగాణలో గడిచిన మూడేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి ఒక్క మంచి పనైనా చేశాడా?. రేవంత్ రెడ్డికి తెలిసింది భూములు అమ్మడం, భూములు కొనడం. రేవంత్‌కు తెలిసింది భూముల దందా ఒక్కటే. బహదూర్‌గూడ భూములపై

-మిగతా 2 లో..

## నాలుగేళ్లు ఎక్కడ చదివితే
# అక్కడే స్థానికులు

### రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించలేం: సుప్రీంకోర్టు
### ఏపీలో ఇంటర్ చదివిన తెలంగాణ విద్యార్థినికి చుక్కెదురు



**ఉన్నత చదువుల కోసం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన తెలంగాణ విద్యార్థినికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వైద్య విద్య తదితర కోర్సుల ప్రవేశాల్లో స్థానికత నిర్ధారణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, రాష్ట్రపతి ఉత్తర్వులే తుది నిర్ణయమని స్పష్టం చేసింది.**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 : వరుసగా నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడే స్థానికులు అవుతారన్న నిబంధన అమల్లో ఉన్నప్పుడు, దానికి విరుద్ధంగా ప్రత్యేక మినహాయింపులు కోరడం కుదరదని తేల్చిచెప్పింది. ఏపీలో ఇంటర్మీడియెట్ చదివిన తనకు తెలంగాణలో స్థానికత కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆలోక్ ఆరాధేలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు 12 ఏళ్ల పాటు తెలంగాణలోనే చదివిన అంకిత.. రెండేళ్ల ఇంటర్మీడియట్‌ను ఏపీలో పూర్తి

-మిగతా 2 లో..

## దానం కుర్సీ ఖాళీ.. ఖైరతాబాద్‌లో ?
# బై-ఎలక్షన్ బులెట్ రెడీ!




**హైదరాబాద్, సెప్టెంబర్ 28:**

ఖైరతాబాద్ అసెంబ్లీ కుర్సీ గన్ లెక్క ఖాళీ అయిపోయింది.. ఎమ్మెల్యే దానం నాగేందర్ పైన 'అనర్హత' వేటు పడ్డట్టు అసెంబ్లీ సెక్రటరీ రెండ్ల తిరుపతి బాజాప్తా గెజిట్ నోటిఫికేషన్ తోడేసిండు. 2024 ఏప్రిల్ 23 నుంచే దానం సాబ్ మిస్సయిండు. ఆ తారీఖు నుంచే సీటు ఖాళీ అయిందని సర్కార్ కన్ఫర్మ్ చేసింది. పార్టీ ఫిరాయింపుల చట్టం దెబ్బకి దానం వికెట్ గిరిపోయింది. ఇక ఖైరతాబాద్‌లో బై-ఎలక్షన్ ధమాకా ఖాయం.. లీడర్లలో టెన్షన్ షురూ.. ఇగ ఎవరి గెలుపు ఉంటదో చూడాలె మరి.



## నవంబర్‌లో 'రాజీవ్ యువ వికాసం'

### బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం: డిప్యూటీ సీఎం భట్టి
### రూ.60 కోట్లతో 50 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు
### 1.30 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు జమ

**రాష్ట్రంలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాసం'పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా పరిశీలించి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు.**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : ప్రజా భవన్‌లో బీసీ సంక్షేమ శాఖపై సోమవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో భట్టి మాట్లాడారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబా పూలే) గురుకులాల్లో ఉన్న పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామన్నారు. గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేయగా, ఆ అంశాన్ని పరిశీలిస్తామని భట్టి చెప్పారు. అర్హులైన విద్యార్థులందరికీ అవకాశం

-మిగతా 2 లో..

## పగలు భగ్గుమంటున్న తెలంగాణ..
### 2 రోజుల్లో సెగ ఇంకా ఎక్కువ!

**హైదరాబాద్, సెప్టెంబర్ 28:**



రాష్ట్రంలో ఎల్‌నినో ఎఫెక్ట్ గట్టిగానే కొడుతోంది.. సాధారణంగా ఉండాల్సిన దానికంటే ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీలు పైకి లేచి జనాన్ని ఉడకబెడుతున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పారద 35 డిగ్రీల గరిష్ఠానికి చేరి సాధారణం కంటే 4 డిగ్రీలు తోడేసింది. రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలకు ఇంకో 2 డిగ్రీల సెగ తోడయ్యే ఆస్కారం ఉందని వాతావరణ శాఖ అలర్ట్ ఇచ్చింది. అన్ సీజన్ ఎండల ధాటికి జనం దిమాగ్ ఖరాబ్ అవ్వకముందే పైజార్ అని జాగ్రత్తలు తీసుకోకపోతే ఆఫత్ ఖాయం!

## భూ సమస్యల పరిష్కారానికి
# రీసర్వేనే ఏకైక మార్గం

### రైతులకు శాశ్వత ప్రయోజనం కలిగేలా సర్వే
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : భూసమస్యల శాశ్వత పరిష్కారానికి రీసర్వేనే ఏకైక మార్గమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూభారతి కింద తొలిదశలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నక్షాలు లేని 413 రెవెన్యూ గ్రామాల్లోనూ దశలవారీగా భూసర్వే నిర్వహిస్తామన్నారు. ప్రతి భూ పార్సిల్‌కు

-2వ పేజీలో

## రేపు సిరిసిల్లకు
# సీఎం రేవంత్

### రూ.345.78 కోట్లతో అభివృద్ధి పనులు
### రగుడు బైపాస్ సమీపంలో భారీ బహిరంగసభ



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : సీఎం రేవంత్ రెడ్డి తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్ల పట్టణంలో ఈనెల 30న పర్యటించనున్నారు. ఈ సందర్భంగా దాదాపు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. చేనేత కార్మికులు, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఆ మేరకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారు. చేనేత,

-2వ పేజీలో

వేగుచుక్క




## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులా?..
# మీరే నష్టపోతారు

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి కన్నుపడింది. రేవంత్ పేదల కడుపుకొట్టి పెద్దవాళ్ల కడుపు నింపే ప్రయత్నం చేస్తున్నారు. సుప్రీంకోర్టు వెళ్లి అయినా సరే మన భూములను కాపాడుకుందాం. బహదూర్‌గూడలో రేవంత్ రెడ్డికి రైతులు కనబడటం లేదు. అక్కడ రూ.6000 కోట్ల భూములు మాత్రమే కనిపిస్తున్నాయి. ఫార్మాసిటీని రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక మాత్రం ఫ్యూచర్ సిటీ కడుతామని అంటున్నారు. రైతులు భూములు ఇచ్చింది.. ఫార్మా సిటీ కోసమే తప్పఫ్యూచర్ సిటీ కోసం కాదు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు మహేశ్వరం, కల్వకుర్తి ప్రాంతాల్లో భారీ భూదందా చేస్తున్నారు. బినామీలు ఎవరెవరు? వారి పేర్లు అన్ని సమయం వచ్చినప్పుడు చెప్తా. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెడితే మీరే నష్టపోతారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు.బుల్లెట్ ట్రైన్‌కు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదు. బుల్లెట్ రైలు పేరుతో చేసే భూ దోపిడీకే మేము వ్యతిరేకం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కోసం సేకరించిన భూముల్లోనే బుల్లెట్ ట్రైన్ పెట్టొచ్చు కదా. ఏడాదిన్నరలో మళ్లీ కేసీఆర్ వస్తారు. కేసీఆర్ వచ్చాక మళ్లీ మీ పట్టాలు మీకు అప్పగిస్తాం. మోసపోతే గోస పడతారని కేసీఆర్ ముందే చెప్పారు.' అని కామెంట్స్ చేశారు.

## భూ సమస్యల పరిష్కారానికి
# రీసర్వేనే ఏకైక మార్గం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక గుర్తింపు, జియో కోఆర్డినేట్స్‌తో మ్యాప్ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ధరణి ఇబ్బందులు తొలగించి భూధార్ కార్డులు అందించడమే లక్ష్యమన్నారు. భూసర్వే కోసం అత్యాధునిక రోవర్లను సమకూర్చుతున్నట్లు చెప్పారు. వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసి సర్వే వేగవంతం చేశామన్నారు. రైతులకు శాశ్వత ప్రయోజనం కలిగేలా సర్వే చేయాలని మంత్రి సూచించారు. టైటిల్ లేని కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రికార్డుల లోపాలు, అబాదీ ఆస్తుల సమస్యలకు సమగ్ర సర్వేతోనే పరిష్కారం లభిస్తుందన్నారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, అబాదీ ఆస్తులకు విస్తీర్ణం, హద్దులతో మ్యాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు.



## జీవోలు 33, 150లతో
# వైద్య విద్యార్థులకు నష్టం

### తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, సెప్టెంబర్ 28:** మెడికల్ సీట్లలో స్థానికత మార్చేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు 33, 150లతో రాష్ట్ర మెడికల్ విద్యార్థులకు పెనుప్రమాదం పొంచి ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కవిత సోమవారం వీడియో సందేశం విడుదల చేశారు. "రాష్ట్రానికి నష్టం చేసే ఇలాంటి జీవోలను రద్దు చేయాలి. 1 నుంచి 7 తరగతుల వరకు ఇక్కడ చదివిన వాళ్లను స్థానికులుగా భావించాలే తప్ప, 8-12 వరకు చదివిన వాళ్లకు స్థానికులుగా అవకాశం ఇవ్వడమేంటి? మెడికల్ సీట్లలో తీసుకొచ్చిన ఈ స్థానికత విధానాన్ని భవిష్యత్తులో అన్ని రంగాల్లో అమలు చేస్తారు. అదే జరిగితే రాష్ట్ర యువత పెద్దఎత్తున నష్టపోవాల్సి వస్తుంది. తెలంగాణ ఉద్యమంలో ఐకాస ఛైర్మన్‌గా ఉన్న ఆచార్య కోదండరాం.. విద్యార్థులకు జరిగే నష్టం గురించి ప్రభుత్వానికి వివరించాలి" అని కోరారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల నేతలతో కవిత సమావేశాలు నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటేలా సిద్ధం కావాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## నాలుగేళ్లు ఎక్కడ చదివితే
# అక్కడే స్థానికులు

చేసింది. ప్రవేశాల సమయంలో స్థానికత నిర్ధారణకు వచ్చే సరికి అంకితకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇంటర్, అంతకుముందు రెండేళ్లు అంటే వరుసగా నాలుగేళ్లు ఎక్కడ చదివితే వారినే స్థానికులుగా పరిగణిస్తామన్న నిబంధనల ప్రకారం ఆమెకు తెలంగాణలో స్థానిక కోటాకు అర్హత లేకుండా పోయింది. దీనిపై ముందుగా ఆమె తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, స్థానికతకు సంబంధించిన నిబంధనలను హైకోర్టు సమర్థించింది. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ కేవలం ఉన్నత విద్యాభ్యాసం కోసమే రెండేళ్లు ఏపీకి వెళ్లిందని తెలిపారు. విద్యార్థిని తండ్రి, తాత కూడా తెలంగాణలోనే నివసిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో స్థానికతను నిరాకరిస్తే అటు ఏపీలో, ఇటు తెలంగాణలో ఎక్కడా స్థానికత వర్తించకుండా ఆమె నష్టపోతుందని వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం స్థానికతకు సంబంధించిన ప్రభుత్వ జీవోను హైకోర్టు ఇప్పటికే సమర్థించిన విషయాన్ని గుర్తుచేసింది. ఈ జీవోను వర్తింపజేస్తే, అందులోని 'నాలుగేళ్ల నిబంధన'ప్రకారమే ప్రక్రియ నడుస్తుందని తేల్చిచెప్పింది. 'తండ్రి ఎక్కడ ఉంటున్నారనే దానితో సంబంధం లేదు. చదువు కోసం మీరు రాష్ట్రం దాటి వెళ్లారు. ఇక్కడ రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లో ఉ ంటాయి. ఆ ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పుడు వాటిని కాదని మీకు ఎలాంటి ప్రత్యేక ప్రయోజనం కల్పించలేం. అది రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుంది' అని న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం పిటిషనర్‌కు ఇతర ప్రత్యామ్నాయం ఏదీ లేదంటూ ధర్మాసనం కేసును కొట్టివేసింది.

## 20 కోట్ల ఓట్లను తొలగించాలన్నది
# ప్రధాని మోదీ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)




మోదీ కూడా అదే తరహాలో ఎన్నికల సంఘాన్ని అనుకూలంగా మలుచుకొనే ఎత్తులు వేస్తున్నారు. 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత తొలిసారి ఓటును రిజిస్టర్ చేయడం కోసం ఫాం-6లో తండ్రులు, తాతల గురించి అడిగారు. దేశవిభజన జరిగిన తర్వాత ఎవరు ఎక్కడి నుంచి వచ్చారో తెలుసుకోవడానికి ఆ నిబంధన పెట్టారు. ఆ తర్వాత జరిగిన ఎస్ఐఆర్‌లు అన్నీ ఓటు హక్కు ఇవ్వడానికి చేపట్టగా.. ఇప్పుడు తొలగించడానికి చేస్తున్నారు. 2014లో దేశంలో 81 కోట్ల మంది, 2019లో 91 కోట్ల మంది, 2024లో 97 కోట్ల మంది ఓటర్లు ఉండేవారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు దేశ జనాభా 35 కోట్ల నుంచి 140 కోట్లకు పెరిగింది. ఓటుహక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించాం. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించడం వెనకున్న ఉద్దేశం ఏంటి? సామాజిక మధ్యమాల్లో మోదీకి వ్యతిరేకంగా ప్రచారం చేసే వారిని ఏఐ ద్వారా గుర్తించి వారందరి ఓట్లను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకే అధికారాలన్నీ బూత్‌స్థాయి నుంచి తొలగించి కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెట్టుకున్నారు. ఈసీఐ.నెట్ వెబ్‌సైట్ నిర్వహించే అధికారాన్ని పూర్తిగా దిల్లీలో కేంద్రీకృతం చేశారు. దానివల్ల ఎవరిని చేరుస్తున్నారు.. ఎవరిని తొలగిస్తున్నారన్నది కిందిస్థాయి వారెవరికీ తెలియదు. కమిషన్‌లోని ముగ్గురు సభ్యుల్లో మిగతా ఇద్దరికీ ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. ఉత్తరకొరియాలో ఎన్నికలు జరిగినా అక్కడ 100% మంది ఆ దేశాధ్యక్షుడు కిమ్‌కు ఓటేయాల్సిందే. ఇప్పుడు జ్ఞానేశ్‌కుమార్‌ను అక్కడికి పంపి శిక్షణ ఇప్పిస్తే 100% మంది మోదీకి ఓటు వేసేలా చేస్తారు" అంటూ రేవంత్ ఎద్దేవా చేశారు. "రాజకీయాల్లో నంబర్ ఉంటేనే గేమ్ నడుస్తుంది. మన దగ్గర సంఖ్యాబలం ఉంటేనే దిల్లీలోని పెద్దలు పిలిచి కూర్చోమంటారు. లేదంటే గేట్‌లోకి కూడా రానివ్వరు. మోదీ.. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల పేరుతో లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచి పెద్ద రాష్ట్రాలను మరింత పెద్దగా చేసి, చిన్న రాష్ట్రాలను చంపేయాలనుకుంటున్నారు. దక్షిణాదిలో ప్రస్తుతం 132 సీట్లున్నాయి. కొత్తగా 66 వచ్చినా మొత్తం సీట్లు 198కి చేరవచ్చు. 850కి పైగా కాబోయే లోక్‌సభ సీట్లలో.. దక్షిణాదివి పోను.. దాదాపు 650 సీట్లు ఉత్తరాది చేతుల్లో ఉంటాయి. అప్పుడు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు దక్షిణాది అవసరమే ఉండదు. అదే జరిగితే మా గురించి ఏం పట్టించుకుంటారు? ఇప్పటికే కేంద్రంలో అన్ని ముఖ్యమైన మంత్రి పదవులను ఉత్తరాది వారికే కట్టబెట్టారు. రాబోయే రోజుల్లో ఇంకేమీ లభించే పరిస్థితి ఉండదు. ఉత్తరాది వారు ఆర్యన్‌లు, దక్షిణాదివారు ద్రావిడులు. మేం శివభక్తులమైతే ఉత్తరాదివారు రామభక్తులు. అందుకే రాముడిని భాజపా చోరీ చేసింది. మోదీ సహా భాజపా నాయకులంతా ఎక్కడైనా జైశ్రీరామ్ అంటారే తప్ప.. హరహర మహాదేవ్ అని అనరు. శివుడు పేదల దేవుడైతే, రాముడు ధనికుల దేవుడు. భాజపా ధనవంతుల పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతానికి 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ స్థానాలు ఉండటంవల్ల మా మీద ఎప్పుడూ జులుం చలాయించేవారు. మేం పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఇలా మైనార్టీలను అణచివేసిన ప్రతిసారీ ప్రపంచవ్యాప్తంగా విప్లవాలు పుట్టుకొచ్చాయి. అందుకే మోదీ ప్రజల మనసులను గెలుచుకోవాలి తప్ప.. నియోజకవర్గాల విభజన కాదు. ఇది దేశానికి కూడా ప్రమాదకరం. ఏబీవీపీ కార్యకర్తగా ఇది నా ఆందోళన. ఇది కేవలం కాంగ్రెస్ భావనే కాదు.. దేశం మొత్తం అభిప్రాయం. ఈ దేశ ప్రజలు అత్యంత తెలివైనవారు. అందుకే వారి ఓటును తొలగించడంపై మోదీ దృష్టి సారించారు. పనిచేసే ముఖ్యమంత్రులకు చేయూతనందించాలన్న మన్మోహన్‌సింగ్ లాంటి విశాల దృక్పథాన్ని మోదీ కూడా కనబరిస్తే బాగుంటుంది. మా వద్ద మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్డు, జాతీయ రహదారుల నిర్మాణాలకు అనుమతివ్వలేదు. 360 కి.మీ. రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు ప్రధానమంత్రి కార్యాలయంలో రెండేళ్లుగా పెండింగ్‌లో పడి ఉంది. అంతా పీఎంవోలోనే ఉందంటూ కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ చేతులెత్తేశారు. గుజరాత్ వద్ద పోర్టులు ఉంటే మా వద్ద మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల లాంటి మేధావులున్నారు. మాకు సెమీ కండక్టర్ పరిశ్రమ ఇచ్చి.. చివరి నిమిషంలో గుజరాత్‌కు తీసుకెళ్లారు. ఇప్పుడు నార్త్ వర్సెస్ సౌత్ అని కాకుండా గుజరాత్ వర్సెస్ మిగతా దేశం అన్న విధానం నడుస్తోంది. ఎన్నికల్లో మోదీ ఉత్తర్‌ప్రదేశ్ నుంచి గెలిచినా ప్రతిదీ గుజరాత్‌కే తీసుకెళ్తున్నారు. తెలంగాణలో మేం విద్యార్థులుగా ఉన్నప్పుడు లెఫ్ట్, రైట్ వింగ్ సంఘాలే ఉండేవి. ఎన్ఎస్‌యూఐ ప్రభావం ఉండేది కాదు. నేను ఏబీవీపీలో చిన్నప్పటి నుంచీ ఉన్నాను. అప్పట్లో భాజపా ప్రభావం లేనందున.. ఏబీవీపీలో పనిచేసిన వారు తదనంతర కాలంలో కాంగ్రెస్‌లో చేరేవారు. నేను ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికే నాటి ప్రతిపక్షమైన తెదేపాలో చేరాను. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో తెదేపా ప్రభావం తగ్గిపోవడంతో 2017లో కాంగ్రెస్‌లో చేరాను. రాహుల్‌గాంధీని కలిసిన తర్వాత ఆయనే నా నాయకుడని నిర్ణయించుకున్నాను" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

# నవంబర్‌లో 'రాజీవ్ యువ వికాసం'

(మొదటిపేజీ తరువాయి)



కల్పించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కూడా త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ కోర్సులు చదువుతున్న బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకే స్కాలర్‌షిప్ నిధులను నేరుగా (డీబీటీ పద్ధతిలో) జమ చేస్తున్నట్లు భట్టి వెల్లడించారు. నూతన విధానం ద్వారా ఇప్పటి వరకు బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని 1.30 లక్షల మంది విద్యార్థులకు రూ.450కోట్ల నిధులను వారి ఖాతాల్లో జమ చేసిన ట్లు తెలిపారు. అలాగే హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను సైతం ఏ నెలకు ఆ నెల కచ్చితంగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయా లని అధికారులను ఆదేశించారు. గీత కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన కాటమయ్య రక్షణ కవచాల పథకం కింద ఇప్పటివరకు 50 వేల మందికి కిట్స్ మంజూరు చేశామని, ఇప్పటికే 40 వేల కిట్ల పంపిణీ పూర్తయిందన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికీ త్వరలోనే రక్షణ కవచం కిట్లు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్ఎస్) భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు కులమతాలకు అతీతంగా ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య, అన్ని సౌకర్యాలు అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో చేపడుతున్న పాఠశాలల నిర్మాణానికి సంబంధించి జిల్లా కలెక్టర్లతో కలిసి ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక వర్క్ క్యాలెండర్ రూపొందించాలని ఆదేశించారు. పనుల పురోగతిని వారానికోసారి సమీక్షించి నివేదికలు తనకు పంపాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న పాఠశాలలను తాను స్వయంగా ఆకస్మికంగా తనిఖీ చేస్తా నని వెల్లడించారు. వచ్చే నెల రెండో వారం నుంచి ఈ తనిఖీలు ప్రారంభిస్తానన్నారు.

## ట్రాఫిక్ చలానా
# చెల్లించకపోతే కరెంట్ కట్

**ఆ జరిమానాలను విద్యుత్ బిల్లులకు జత చేయండి**

**వాహన యాజమాన్య హక్కు బదిలీ నిలిపివేయండి**

**పదేపదే ఉల్లంఘనలకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు**

**రవాణాశాఖ అధికారులకు సుప్రీంకోర్టు ఆదేశం**



**దిల్లీ:** రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతకు గాను వాహనదారులు, చోదకులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించేలా చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఇప్పటివరకూ ఈ-చలాన్ల రూపంలో విధించిన జరిమానాల్లో ఇంకా రూ.20వేల కోట్లు వసూలుకాని విషయాన్ని గుర్తు చేస్తూ కఠిన చర్యలకు ఆదేశించింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై 2012లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఎలక్ట్రానిక్ మానిటరింగ్ నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు రూ.45వేల కోట్ల విలువైన చలానాలు జారీచేయగా ఇప్పటివరకు రూ.25వేల కోట్లు మాత్రమే వసూలు చేసినట్లు కోర్టు సహాయకుడు(అమికస్ క్యూరీ) తెలిపిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనులకు జారీ అయిన చలాన్లను నెలవారీ విద్యుత్తు బిల్లులో చేర్చి వసూలుచేయాలని ఆదేశించింది. విద్యుత్తు బిల్లు చెల్లించకపోతే విద్యుత్తు సరఫరా కట్ చేస్తారు కాబట్టి జరిమానా కచ్చితంగా చెల్లిస్తారని అభిప్రాయపడింది. ఈ-చలానా బకాయిలు చెల్లించని వాహనాలకు ఆన్‌లైన్ సేవలు నిలిపివేయాలి. ఆర్‌సీల పునరుద్ధరణ, డూప్లికేట్ ఆర్‌సీల జారీ, యజమాని చిరునామా అప్‌డేషన్‌లాంటి సేవలు నిషేధించాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లూ జారీ చేయొద్దు. వాహన స్వాధీనానికి చర్యలు తీసుకోవాలి. ఎక్కువసార్లు ఉల్లంఘనలకు పాల్పడిన వారి డ్రైవింగ్ లైసెన్స్/రెన్యూవల్‌ను రద్దు చేయాలి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు మోటారు వాహనాల చట్టంలోని నిబంధనల అమలు కోసం తీసుకోబోతున్న చర్యల గురించి నిర్దిష్టమైన గడువులతో అఫిడవిట్ దాఖలుచేయాలి. నిబంధనలు అమలుచేయని అధికారుల విషయంలో ఏం చేయాలనేది నిర్ణయించడంలో అమికస్‌క్యూరీ సమర్పించే నివేదికే అత్యంత కీలకమని జస్టిస్ పార్దీవాలా పేర్కొన్నారు.

# రేపు సిరిసిల్లకు సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

పవర్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు నేతన్న బజార్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ, సిరిసిల్లలో రెండు ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడలలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. పెద్దూరులో 18 ఎకరాల్లో ప్రతిపాదించిన ఈ కాంప్లెక్సులో 5 నుంచి 12వ తరగతి వరకు 2600 మంది విద్యార్థులు చదువుకునేలా 64 తరగతి గదులు, వసతి, డార్మెటరీలు, డైనింగ్ బ్లాక్, క్రీడామైదానాలు ఉంటాయి. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్‌హాల్స్, క్రీడాసదుపాయాలు, ఐటీ మౌలిక వసతులు ఉంటాయి. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయాభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. మండపాలు, గోపురాలు, ప్రాకారాలు, నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్తు పనులు, షాపింగ్ కాంప్లెక్సులు, ఉత్తరంవైపు సీసీరోడ్డు తదితర 26 పనులు ఉన్నాయి. సిరిసిల్ల, వేములవాడ ఆర్టీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగిలో నాలుగు తహసీల్దారు కార్యాలయాలు, వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలకు ఉపయోగపడేలా రుద్రంగిలో 10,000 టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళాశక్తి భవన్‌ను సీఎం ప్రారంభిస్తారు.

## అక్టోబరు, నవంబరులలో
# నియామక పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యనిర్వాహక ఇంజినీర్లు 222, పాఠశాల విద్యాశాఖలో డిప్యూటీ విద్యాధికారి 24 పోస్టుల భర్తీకి జూన్‌లో ప్రకటనలు జారీచేసింది. దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత సన్నద్ధమయ్యేందుకు 3 నెలల గడువు ఇస్తూ రాతపరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. నియామకాలకు సంబంధించి 90% నోటిఫికేషన్లకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించాలని కమిషన్ ఇప్పటికే నిర్ణయించింది. ఈ పరీక్షలకు ఒక రోజు లేదా గంట ముందు ప్రశ్నపత్రం ఆటోమేటిక్‌గా సిద్ధమయ్యేలా ప్రణాళిక తయారు చేస్తోంది. సీబీఆర్‌టీ పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థికి అప్పటికే సిద్ధమైన ప్రాథమిక కీ ప్రకారం ఆ పరీక్షలో సాధించిన స్కోరు స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యేలా సంస్కరణలు చేస్తోంది. దరఖాస్తులు ఎక్కువగా వచ్చిన పరీక్షలకు బహుళ సెషన్ల పరీక్షలు నిర్వహించనుంది. సీబీఆర్‌టీ విధానం నేపథ్యంలో మార్కుల వెల్లడి, ధ్రువీకరణపత్రాల పరిశీలన ప్రక్రియను పరిగణనలోకి తీసుకుంటే ఒక అంచెలో నిర్వహించే పోటీపరీక్షల నియామకాలను 3-6 నెలల్లో పూర్తిచేస్తామని కమిషన్ ఇప్పటికే ప్రకటించింది. రెండు లేదా అంతకుమించిన అంచెల్లో నిర్వహిస్తే ఆయా ఉద్యోగాలను 6-9 నెలల్లో భర్తీ చేస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో పరీక్షల ఫలితాలు వేగంగా వచ్చే అవకాశాలున్నాయి.

# దేశంలో బొగ్గు కొరత లేదు

(మొదటిపేజీ తరువాయి)



బొగ్గు కొరతగా భావించొద్దన్నారు. మొత్తం మీద పరిస్థితి సాధారణంగానే ఉందని ఉద్ఘాటించారు. బొగ్గు కొరత ఎక్కడా లేదని.. మేము రైలు, రోడ్డు మార్గాల ద్వారా సరఫరా చేస్తునామన్నారు. సోమవారం కోల్‌కతాలో అసోచామ్ నిర్వహించిన అంగుల్ అల్యూమినియం పార్క్ పారిశ్రామిక రోడ్‌షోను ఉద్దేశించి కిషన్‌రెడ్డి ప్రసంగించారు. బెంగాల్‌లో బొగ్గు రంగం ఎన్నో ఏళ్ల నుంచి అక్రమ మైనింగ్ నిర్వాహకులు, మాఫియాల గుప్పిట్లో చిక్కుకుపోయిందని పేర్కొన్నారు. ఈ రంగంలో పారదర్శకతను తీసుకురావడానికి, అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి, మైనింగ్ ఆదాయాలు రాష్ట్ర ఖజానాకు చేరేలా చూడటానికి కేంద్రం సంస్కరణలు చేపడుతోందని ప్రకటించారు.

# భూసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

**వనపర్తి, సెప్టెంబర్ 28 :**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర భూసర్వే ఒక్కటే మార్గమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వనపర్తిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భూ భారతి చట్టం ద్వారా భూ వివాదాలకు దీర్ఘకాలిక పరిష్కారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను తొలి దశ సర్వేకు ఎంపిక చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే నక్షాలు అందుబాటులో లేని 413 రెవెన్యూ గ్రామాల్లో కూడా దశలవారీగా సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, జియో కోఆర్డినేట్లతో కూడిన మ్యాప్, ప్రత్యేక భూ గుర్తింపు సంఖ్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భూసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరికరా లను సమకూర్చినట్లు మంత్రి వివరించారు. తొలి దశలో కొనుగోలు చేసిన పరికరాలతో పాటు అదనపు పరికరా లను కూడా జిల్లాలకు అందిస్తున్నామని చెప్పారు. వేలాది మంది సర్వేయర్లకు అనుమతులు మంజూరు చేసి క్షేత్రస్థా యిలో సర్వే కార్యక్రమాన్ని



వేగంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రికార్డుల లోపాలు, అబాది ఆస్తులకు సంబంధించిన సమస్యలను సమగ్ర సర్వే ద్వారా పరిష్కరించవచ్చని మంత్రి పేర్కొన్నారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాలు, ఇతర ఆస్తుల విస్తీర్ణం, హద్దులను ఖచ్చితంగా గుర్తించి రికార్డుల్లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రికార్డులను అధునీకరించడమే లక్ష్యమన్నారు. దశాబ్దాలుగా సాగులో ఉన్నప్పటికీ సరైన హక్కు పత్రాలు లేని కుటుంబాల సమస్యలను కూడా గుర్తించి పరిష్కరించాలని అధికా రులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు, భూ యజమా నులు ప్రభుత్వ సర్వే కార్యక్రమానికి సహకరించాలని, రాజకీయ ప్రచారాలను పట్టించుకోకుండా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా మంత్రి కీలక ప్రకటన చేశారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. రెండో విడతలో కొత్త ఇళ్లతో పాటు గతంలో అసంపూర్తిగా నిలిచిన ఇళ్లను కూడా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో బిల్‌ట్రస్ట్‌కు శ్రీకారం

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 :**

అంతర్జాతీయ సంస్థ బిల్‌ట్రస్ట్ తన భారతీయ గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని రాష్ట్ర పరిశ్రమలు, సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. తెలంగాణలో బిల్‌ట్రస్ట్ కార్యకలాపాలకు ఇది కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. హైద రాబాద్ ప్రపంచ స్థాయి సంస్థలకు ప్రధాన గమ్యస్థా నంగా మారుతోందని మంత్రి తెలిపారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన సాంకేతిక వాతా వరణం, అనుకూల వ్యాపార విధానాలు నగరాన్ని పెట్టుబ డులకు ఆకర్షణీయ కేంద్రంగా నిలబెడు తున్నాయని చెప్పారు. గ్లోబల్ సామర్థ్య కేంద్రాలను కేవలం కార్యాలయాలుగా కాకుండా ప్రపంచ స్థాయి విలువ సృష్టి కేంద్రాలుగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కొత్త ఆవిష్కరణలు, సాంకేతిక సామర్థ్యాల అభివృద్ధి, ప్రపంచ వ్యాప్త వ్యాపార విస్తరణకు తెలంగాణ వేదికగా మారాలని ప్రభుత్వం కృషి చేస్తోం



దన్నారు. బిల్‌ట్రస్ట్ వంటి సంస్థల రాకతో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు సాంకేతిక రంగానికి మరింత బలం చేకూరుతుందని ఆయన అభిప్రా యపడ్డారు. తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభించిన బిల్‌ట్రస్ట్‌కు ప్రభుత్వం తరఫున స్వాగతం పలుకుతూ, సంస్థతో దీర్ఘకాలిక భాగస్వామ్యం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పేరు పొందిన సంస్థలు హైదరాబాద్‌ను తమ విస్తరణ కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని పరిశ్రమల వర్గాలు పేర్కొం టున్నాయి. దీంతో తెలంగాణ అంతర్జాతీయ పెట్టు బడుల కేంద్రంగా మరింత బలోపేతం అవుతోందని అభిప్రాయ పడుతున్నాయి.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపై బీఆర్ఎస్ దృష్టి

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 :**

హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించడం లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూడు జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఎన్నికల సన్నాహాలు, ఓటరు నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయి సమన్వయం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉందని కేటీఆర్ పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. గతంలో సాధించిన విజయాన్ని పునరావృతం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని, అయితే ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేస్తేనే లక్ష్యం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో విజయానికి ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత కీలకమని కేటీఆర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థల స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.



మూడు జిల్లాల్లో పార్టీ నిర్మా ణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువత, ఉద్యోగులు, పట్టభద్రులతో నిరంతర సంబంధాలు కొన సాగించాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజా సమ స్యలపై పార్టీ పోరాటాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రాడ్యుయేట్ వర్గాల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలం, డివిజన్, పట్టణ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ చేపట్టాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఓటరు నమోదు నుంచి పోలింగ్ వరకు ప్రతి దశలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు ఎన్నికల విజయానికి అవసరమైన కార్యా చరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని మరోసారి గెలుచుకునేందుకు పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేస్తాయని, బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ ఆందోళన

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 :**

దేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో తలెత్తుతున్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ వ్యవహార శైలిపై తమ పార్టీకి పలు అభ్యంతరాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఓటర్ల జాబితాల నిర్వహణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజల విశ్వాసం వంటి అంశాలపై స్పష్టత అవసరమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉండాలంటే ఎన్నికల నిర్వహణపై ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలకు సంబంధించి ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బ తినకుండా ఉండేందుకు అన్ని అంశాలను పారదర్శకంగా పరిశీలించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దాని పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. కాంగ్రెస్ అగ్ర



నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ ఉద్యమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్నికల కమిషన్‌పై చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాలేనని, వాటిపై ఎన్నికల కమిషన్ లేదా ఇతర పక్షాల నుంచి భిన్న అభిప్రాయాలు ఉండవచ్చని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అంశంపై దేశవ్యాప్తంగా రాజకీయ చర్చ కొనసాగుతోంది. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడేలా అన్ని వర్గాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. బీఆర్‌కే భవన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల బలోపేతం కోసం తమ పోరాటం కొనసాగుతుందని పార్టీ నాయకులు స్పష్టం చేశారు.



# ప్రహరీలతో మూసుకుపోతున్న దారులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 :**

నగర శివార్లలో గతంలో ఏర్పాటైన కాలనీల చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడలు ప్రస్తుతం కొత్తగా అభివృద్ధి చెందిన నివాస ప్రాంతాలకు అడ్డంకిగా మారుతున్నాయని పలువురు నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో చుట్టుపక్కల నివాస ప్రాంతాలు లేకపోవడంతో ప్రహరీ గోడలు పెద్ద సమస్యగా కనిపించలేదని, అయితే ఇప్పుడు కొత్త కాలనీలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోయారు. ప్రజలకు అవసరమైన దారులు కల్పించకుండా ప్రహరీలతో మార్గాలను మూసివేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరు గ్రామంలోని ప్రజయ్ గుల్‌మొహర్ కాలనీ పరిసర ప్రాంతాల నివాసితులు తమ ప్లాట్లకు వెళ్లే దారులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేశారు. కాలనీ చుట్టూ నిర్మించిన ప్రహరీలను తొలగించకపోవడం వల్ల తమ భూములకు చేరుకోవడం కష్టమవుతోందని హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్ ప్రాంతంలో కూడా ఇదే తరహా సమస్య నెలకొంది. సుమారు 85 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో రహదారులు, పార్కుల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని ప్లాట్ యజమానుల సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.




# టీజీపీఎస్సీ పరీక్షల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 :**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ ప్రకటనతో లక్షలాది మంది అభ్యర్థుల్లో ఉత్సాహం నెలకొంది. టీజీపీఎస్సీ విడుదల చేసిన వివరాల ప్రకారం అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపట్టనున్నట్లు కమిషన్ పేర్కొంది. అభ్యర్థులు ముందుగానే తమ సన్నాహక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పరిధిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అక్టోబర్ 24న పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి అక్టోబర్ 26న పరీక్ష జరగనుంది. ఈ రెండు పోస్టులకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. రోడ్లు, భవనాల శాఖలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. సాంకేతిక విభాగానికి చెందిన ఈ పోస్టుల కోసం ఇంజినీరింగ్ పట్టభద్రులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# మైనర్‌పై అత్యాచారం.. సుమోటోగా తీసుకున్న సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :**

ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో కదులుతున్న బస్సులో మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనను సుప్రీంకోర్టు సోమవారం సుమోటోగా స్వీకరించింది. ఈ సందర్భంగా అత్యాచార ఘటనల పునరావృతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం, ఇటువంటి సంఘటనలు శాంతిభద్రతల నిర్వహణలో వ్యవస్థాగత వైఫల్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొంది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. 2012లో దేశాన్ని కుదిపేసిన నిర్భయ ఘటనతో ఈ కేసుకు పోలికలు ఉన్నాయని అభిప్రాయపడింది. దశాబ్దానికి పైగా గడిచినప్పటికీ మహిళల భద్రత విషయంలో చట్ట అమలు వ్యవస్థలు ఎంత మేరకు పురోగతి సాధించాయనే ప్రశ్న తలెత్తుతోందని పేర్కొంది. దేశ రాజధాని ప్రాంతంలో వరుసగా వెలుగుచూస్తున్న లైంగిక నేరాల ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ధర్మాసనం తెలిపింది. ప్రజల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ఉన్న వ్యవస్థలు సమర్థంగా పనిచేయకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతాయని వ్యాఖ్యానించింది.

వేగుచుక్క

# ఎరుపెక్కిన పల్లెల గుండెల్లో.. చెరగని "పోరు కెరటం యాదన్న".

## చంద్ర పుల్లారెడ్డి బాటలో ప్రజా ఉద్యమాల నిర్మాణం.

## ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎర్రజెండాకు వన్నె తెచ్చిన యోధుడు.

## నేడు అమరుడు యాదన్న 36వ వర్ధంతి.

"చంద్ర పుల్లారెడ్డి బాటలో సిరిసిల్ల రైతాంగ, ప్రతిఘటనోద్యమ నాయకులు ముదాం రాములన్న, భూపతన్న తో కలిసి నడిచాడు యాదన్న, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రైతాంగ పోరాటాలకు ఊపిరి పోసి, పిడిఎస్ యు విద్యార్థి ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచి సమసమాజ స్థాపన కోసం పోరాడిన యోధుడు, కామారెడ్డి ప్రాంతాన్ని పోరాట కేంద్రంగా మలచి ఎర్రబాటలు వేసిన యాదన్న (రమేష్ అన్న) అమరుడై నేటికి 36 ఏళ్లు".




**వేగుచుక్క న్యూస్:**

నల్గొండ జిల్లాలోని , రాచకొండ గుట్టల్లో తొలి పొద్దయి పొడిచి లచ్చమ్మ గూడెంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన యాదన్న , జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొంటూ, పోరు బాటలో అడుగులు వేశాడు. సిరిసిల్ల రైతాంగ, ప్రతిఘటనోద్యమ నాయకులు ముదాం రాములన్న, భూపతన్న తో కలిసి అప్పటి మూడు జిల్లాల సరిహద్దు అయిన నిజామాబాద్ జిల్లా, దోమకొండ మండలం, తుజాల్ పూర్ గ్రామం నుండి ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఊరూరూ సైకిల్ పై తిరుగుతూ ప్రజా సంఘాల్ని నిర్మించి, వారి సమస్యలపై పోరాడాడు. విద్యార్థులను, యువతలో చైతన్యం తీసుకొచ్చి ఉద్యమంలో భాగస్వాములను చేశాడు. ప్రజా ఉద్యమాల పెద్దన్న చంద్ర పుల్లారెడ్డి మార్గంలో నడిచిన యాదన్న... సిరిసిల్ల, జగిత్యాల రైతాంగ పోరాటాల వెల్లువలో కార్యకర్తగా మొదలై, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ప్రజా నాయకుడిగా ఎదిగాడు. పేద ప్రజలకు ప్రేమ, ఆప్యాయత పంచిన యాదన్న పెదవులపై ఎప్పుడూ చెరగని చిరునవ్వు సొంతం.. అదే సమయంలో ఊరిలో దోపిడి, దౌర్జన్యాలపై నిప్పులు చెరిగే వాడు. రైతు, కూలీ, పేద ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటం సాగించారు. నిజామాబాద్, కరీంనగర్, మెదక్ సరిహద్దు జిల్లాల్లో ఊరూరూ తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచారు. బీడీ కార్మికుల సమస్యలపై ఉద్యమాలను నిర్మించాడు.

పిడిఎస్ యు విద్యార్థి సంఘానికి అండగా నిలబడి అనేక మంది విద్యార్థి నాయకులను ఉద్యమానికి అందించిన సిద్ధాంతకర్తగా నిలిచారు. ఉద్యమ జీవితంలో పలుమార్లు అరెస్టయి పోలీసు చిత్రహింసలను ఎదుర్కొన్నా, ఆయన ఆత్మస్థైర్యం చెక్కుచెదరలేదు.

ఉద్యమ అవసరాల రీత్యా జగిత్యాల ప్రాంతానికి యాదన్నను అప్పటి నాయకత్వం కేటాయించారు. దీనితో అప్పటి వరకు తనకు అండగా నిలిచిన ప్రజల్ని కలిసి వెళ్లడానికి నిర్ణయం తీసుకున్నాడు. ఈ క్రమంలో 1990 సెప్టెంబర్ 29 అర్ధరాత్రి... ప్రస్తుత బీబీపేట మండలం, ఇస్సన్నగర్ చెరువు కట్ట వద్దకు మరో సహచరుడితో చేరుకున్న నిరాయుధుడైన యాదన్నపై అరాచకవాదులు దాడి చేశారు. ఈ దాడిలో ఆయన అక్కడికక్కడే అమరుడయ్యారు.

**నేటికి చెరగని ముద్ర..**

చంద్ర పుల్లారెడ్డి వర్గం యాదన్న అమరుడైన అనంతరం 1992లో పలు పార్టీలతో కలిసి జనశక్తి పార్టీగా ఆవిర్భవించింది. ఆయన బాటలో అనేక మంది నడిచారు. అమరుడై 36 ఏళ్లు గడుస్తున్నా, ఆయన పల్లెల్లో ప్రజల గుండెల్లో నేటికి నిలిచే ఉన్నారు.

# అమెరికా ఆంక్షలకు తలొగ్గిన భారత ప్రభుత్వం.






## సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ నాయకుల ఆరోపణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

అమెరికా ఆంక్షలకు భారత ప్రభుత్వం తల్లొగ్గిందని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు ఆరోపించారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ నిజామాబాద్ అర్బన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, పాలస్తీనా క్యూబా ప్రజల సార్వభౌమత్వ పోరాటాలకు సంఘీభావంగా కామ్రేడ్ భగత్ సింగ్ జయంతిసభను జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ, కామ్రేడ్ భగత్ సింగ్ దృష్టిలో భారతదేశ విముక్తి అనేది మానవ విముక్తికోసం సాగుతున్న విస్తృత పోరాటంలో ఒక భాగంగా చూడాలన్నారు. పాలస్తీనా ప్రజల పోరాటం హక్కులు, స్వేచ్ఛ, స్వయంనిర్ణయాధికారం కోసం జరుగుతున్నదన్నారు. క్యూబా తన సార్వభౌమత్వాన్ని స్వతంత్ర రాజకీయ మార్గాన్ని కాపాడుకోవడానికి పోరాటం చేస్తుందన్నారు. ఈ రెండు పోరాటాలకు భారత్ ప్రజలు సంఘీభావం తెలపడం అవసరమన్నారు. భగత్ సింగ్ అంతర్జాతీయ వాదంతో కూడిన జాతీయవాది అని అన్నారు. జాతీయవాదమని చెప్పుకుంటున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు అమెరికా సామ్రాజ్యవాద ఒత్తిడికి తలొగ్గి, వారితో వాణిజ్య ఒప్పందం చేసుకుందన్నారు. మన వ్యవసాయ రంగానికి ఉరితాళ్లు బిగిస్తున్నదన్నారు. రష్యా ఆయిల్ కొనవద్దని అమెరికా ఆంక్షలకు మోడీ ప్రభుత్వం తలొగ్గిందన్నారు. తద్వారా మన ఆయిల్ ఖర్చు పెరిగి, ప్రజలపై భారం పెరిగిందన్నారు. పాలస్తీనా, ఇరాన్, క్యూబాలపై అమెరికా

ఆంక్షలు, దాడులను మోడీ ప్రభుత్వం ఖండించకపోవడం ఇజ్రాయిల్ని పొగడడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. భగత్ సింగ్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట స్ఫూర్తితో పాలస్తీనా క్యూబా, ఇరాన్ లకు సంఘీభావం తెలపాలన్నారు.

సభ అనంతరం ప్లకార్డులతో ధర్నా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎం. నరేందర్ జిల్లా నాయకులు ఎం. వెంకన్న, డి. రాజేశ్వర్, కే. గంగాధర్, కే. గణేష్, వి.గోదావరి, ఎం. నారాయణ, ఎం. సాయిబాబా లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ జిల్లా నాయకులు బి.మల్లేష్, డి.కిషన్, బి.మురళి, కే.సంధ్యారాణి సాయరెడ్డి, బీక్ సింగ్, అనిల్, నసీర్, సృజన్, భాస్కర స్వామి, ఒడ్డెన్న, నాగమణి, చరణ్, రమేష్ మానస తదితరులు పాల్గొన్నారు.

# లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 28**




: నిజామాబాద్ నార్త్ మండలం పరిధిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలో గల రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు కోసం సోమవారం మున్సిపల్ సిటిజన్ సర్వీస్ సెంటర్ భవనంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ లక్కీ డ్రా నిర్వహించారు. నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ల పర్యవేక్షణలో ఈ లాటరీ ప్రక్రియ జరిగింది. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ అర్హత కలిగిన వారి పేర్లను అందరి సమక్షంలో డ్రా తీస్తూ లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారు. ఎలాంటి పొరపాట్లు, అనుమానాలకు తావు లేకుండా వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అర్హులుగా ఖరారైన దరఖాస్తుదారుల సమక్షంలో, వీడియోగ్రఫీ చిత్రీకరణ మధ్య పూర్తి పారదర్శకంగా లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను విజయవంతంగా జరిపించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎస్టీ లకు 6 శాతం, ఎస్సీలకు 17 శాతం, మైనారిటీలకు 12 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున రిజర్వేషన్లను అమలు చేస్తూ లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేస్తూ పేర్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ బి.చంద్రశేఖర్, హౌసింగ్ ఈ.ఈ జె.రాజ్యలక్ష్మి, నార్త్ తహసీల్దార్ హరికిశోర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, లాటరీ ద్వారా రెండు పడక గదుల ఇల్లు కేటాయించబడిన లబ్ధిదారులు తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు ప్రకటించారు.

# అవినీతికి కేరాఫ్ ఇందూరు బల్దియా...










- కార్పొరేషన్ బడ్జెట్లో కోట్లు..పనులు మాత్రం శూన్యం..
- ప్రభుత్వం,మేయర్, పీసీసీ అందరూ కాంగ్రెస్సే... అయినా అభివృద్ధి ఎక్కడా..
- బల్దియాపై పోరు ఉద్యమంలో ఎమ్మెల్యే ధన్ పాల్ ఫైర్...
- ర్యాలీగా కార్పొరేషన్ కార్యాలయానికి ఎమ్మెల్యే, బీజేపీ కార్పొరేటర్లు...
- తీవ్ర ఉద్రిక్తత.. కార్యాలయం ముందు బైఠాయింపు..

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా నిజామాబాద్ కార్పొరేషన్ మారిందని, ప్రతి బడ్జెట్ మీటింగ్ లో కోట్లు కేటాయిస్తారు కానీ పనుల కోసం రూపాయి ఖర్చు చేయడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. ఎమ్మెల్యేతో పాటు బీజేపీ కార్పొరేటర్లు సోమవారం నగరంలోని ధర్నా చౌక్లో బీజేపీ పోరు ఉద్యమం చేపట్టింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అభివృద్ధి కోసం ఒక ఎమ్మెల్యే గా ఉండి కూడా ధర్నా చేస్తున్నానంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కార్పొరేషన్లు 150 కోట్ల ఆదాయం, 94 కోట్ల మిగులు బడ్జెట్ ఉన్నా ఒక్క రూపాయి ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటున్నారు. పదేళ్లు బీఆర్ఎస్ పాలించినా.. మేయర్ వాళ్లే ఉన్నా అభివృద్ధి చేయలేకపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తుందని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ అభివృద్ధి కొరకు 200 కోట్లు మంజూరు చేస్తామని చెప్పి ఇప్పటివరకు విడుదల చేయలేరన్నారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఇక్కడి మేయర్ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. నిజామాబాద్ ప్రజలకు నిధులు కాగితాలపై కనిపించడం అవసరం లేదు. ఆ నిధులతో చేసిన రోడ్లు కనిపించాలి, నిర్మించిన డ్రైనేజీలు కనిపించాలి, వెలిగే దీపాలు కనిపించాలన్నారు. కమిషనర్ కు అనేకసార్లు కలిసి లేఖలు అందించినా స్పందించకపోవడం తగదన్నారు. బడ్జెట్ లో డివిజన్ల అభివృద్ధి కొరకు 35 కోట్లు కేటాయించినా..ఇప్పటి వరకు ఒక్క డివిజన్ కు కూడా రూపాయి కేటాయించలేదన్నారు.

అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ... ఇందూరు అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కలిసి నిధులు తీసుకొస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని పథకాల్లో కేంద్రం వాటా ఉందన్నారు. మాధవ నగర్ వంతెనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఇందూరు అభివృద్ధి కొరకు గెలిచిన ఎమ్మెల్యేకు నిధులు ఇవ్వకుండా ఓడిన షబ్బీర్లులకి మహేష్ కుమార్ గౌడ్కు పెత్తనం ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు.




**కార్పొరేషన్ ముట్టడి.... ఉద్రిక్తత....**

బల్దియా సమస్యల పరిష్కారానికి, కమిషనర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ధర్నాచౌక్ లో ధర్నా అనంతరం కార్పొరేషన్ కార్యాలయ ముట్టడికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఎమ్మెల్యే, బిజెపి కార్పొరేటర్ల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో ఎమ్మెల్యే ధన్ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ వచ్చే వరకు జరిగేది లేదని హెచ్చరించి బైఠాయించారు. అనంతరం కమిషనర్ దిలీప్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు 28 మంది, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, ఆయా మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో మావోయిస్టు కేసు..

## - గొల్ల జనార్ధన్ కు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



నిషేధిత మావోయిస్టు కార్యకలాపాల కేసులో సిరికొండ మండలం నారాయణపల్లికి చెందిన బూసా జనార్ధన్ అలియాస్ గొల్ల జనార్ధన్‌కు కోర్టు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. 2022లో జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేయగా, విచారణ అనంతరం నేరం నిరూపణ కావడంతో కోర్టు ఈ శిక్ష విధించింది. జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో నిందితుడు నిషేధిత సంస్థ కార్యకలాపాలకు అనుసంధానమైనట్లు పోలీసులు ఆరోపించారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత ఛార్జిషీట్ దాఖలు కాగా, కోర్టు విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించి శిక్ష విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.

**పోలీసు యంత్రాంగానికి సీపీ అభినందన.**

కేసులో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నిజామాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అభినందించారు. నిషేధిత సంస్థల కార్యకలాపాలపై నిఘా కొనసాగించి, సాక్ష్యాధారాలతో కేసులను కోర్టు వరకు తీసుకెళ్లడం ముఖ్యమని అధికారులు పేర్కొంటున్నారు.